కథ

**కాకాని కమల**

**ఎత్తునుండి గాలిలో తేలుతూ మబ్బుల్లో నుండి పోతున్న విమానంతోపాటు నా మనసూ గాలిలో తేలిపోతూంది. దాదాపు ఇరవై ఎనిమిది సంవత్సరాల తర్వాత స్వగ్రామంలో వుండబోతున్నాను.**

'పాతికేళ్ళు పైగా బొంబాయిలాంటి మహానగరంలో వున్న మీకు ఆ పల్లెటూళ్ళో గడుస్తుందా?' అన్నవాళ్ళు లేకపోలేదు. కానీ నాకు మాత్రం బొంబాయిలాంటి నగర జీవితం విసుగొచ్చింది.

కాదని పల్లెకి ఎలా రాగలడు? తను రాగలిగినా ముందు మా ఆవిడ పిల్లలు అసలు ఒప్పుకోలేదు. అందుకే బొంబాయిలోనే అతుక్కుపోయాను.

కానీ ఇప్పుడు రిటైర్ అయ్యాను.

# శ్రమశక్తి

నిత్యం అపార్ట్‌మెంటులో జైలుగదిలో కూర్చున్నట్టు కూర్చొని, కాంక్రీటు గాలులు పీలుస్తూ చంద్రుడు సూర్యుడు కనిపించే వాళ్ళు కాదు.

లిఫ్టులోనే అయినా ఇరవై నాలుగు అంతస్తులు దాటి టెర్రస్ మీదికి వెళ్ళే ఓపిక, సమయం లేక సూర్యుడు కనిపించకపోయినా మా బాల్కనీలో నుంచే సూర్యకాంతిని చూసి నమస్కరించి ఆదిత్యహృదయం చదువుకొని తృప్తిపడేవాడిని.

నవనవలాడే కూరలు, పండ్లు, ఎంచుకుని ఎంచుకుని కొనుక్కోవటం నాకు మా ఆవిడకి సరదా. కానీ పైన నలభై ఆరో అంతస్తు బాల్కనీలోంచి బుట్టకి తాడు కట్టి కిందికి వదిలితే కూరగాయల బండి వాడే ఏరి, తూచి బుట్టలో వేసేవాడు. డబ్బులు అందులోన వుండేవి. బావిలోంచి నీళ్ళు చేద లాగినట్లు ఆ బుట్టని తాడుతో పైకి లాగేవాళ్ళం. కాని ఇప్పుడు రిటైర్ అయ్యాను. బొంబాయిలో ఫ్లాట్ అమ్మేశాను.

ఎనభై లక్షల దాకా వచ్చింది.

స్వగ్రామంలో ఆరు గదుల పెంకుటిల్లు.

చుట్టూ ఐదువందల గజాల పెరటి స్థలం.

బోరింగ్ తవ్వించాను. నుయ్యి కూడా వుంది.

నీరు తియ్యగా వుంటుంది.

ఊరి చివర కాలవ పక్కన పది ఎకరాల పొలం.

ఏటా కోతల సమయాన గ్రామం వెళ్ళినప్పుడల్లా అక్కడే వుండి పోవాలనిపించేది. కాని ఎలా?

ఉద్యోగం వదిలి రావటం కుదరదు.

ఏడాదికి రెండు మూడుసార్లు విదేశాలకి వెళ్ళి మూడేసి నెలలు వుండి వచ్చే బంగారు భవిష్యత్తుని నలుగురు పిల్లలకి పెళ్ళి పేరంటాలు అయ్యాయి. అందరూ పెద్ద ఉద్యోగాల్లో నగరాల్లో స్థిరపడ్డారు.

నేను మా ఆవిడా గ్రామం వెడదాం అని నిర్ణయించుకున్నాం.

పొలాలు కౌలుకి ఇచ్చాను.

నా పెంకుటిల్లు, దొడ్డి సుబ్బన్నకి చూసుకోమని ఇచ్చాను. సుబ్బన్న మాకు చాలా కాలంగా బాగా తెలుసున్నవాడు. సుబ్బన్న మొదటి పెళ్ళాం చచ్చిపోతే మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆరుగురు పిల్లలు. సుబ్బన్న తాతతండ్రులు మా నాన్న, తాతల దగ్గర నమ్మకస్తులు. అందుకే గ్రామం వదిలి ఉద్యోగానికి బొంబాయి వస్తూ మా ఇల్లు సుబ్బన్నకి అప్పగించాను. మూడు వందల గజాల్లో ఆరు చిన్న చిన్న గదుల పెంకుటిల్లు. మిగతా ఐదు వందల గజాలు ఇంటి చుట్టూ ఖాళీ స్థలం. చుట్టూ ప్రహరీ గోడ. పెద్ద గేటు. పెద్ద ఊటబావి. తియ్యని నీళ్ళు ఏడాది పొడుగునా పుష్కలంగా దొరుకుతాయి. ఆ పల్లెటూళ్ళల్లో ఇల్లు అద్దెలకి రారు. ఎవరన్నా తెలుసున్న వాళ్ళకి ఇస్తే ఏ స్కూలు పంతుళ్ళో గుడి పూజారి వంటి వారలో వచ్చి ఉంటారు. ఇల్లు పాడబడకుండా శుభ్రంగా అలికి ముగ్గెట్టి దీపం పెట్టుకుంటారు. సుబ్బన్నని పిలిచి చెప్పాను.

''సుబ్బన్నా..ఈ ఇల్లు నీకు అప్పగిస్తున్నాను. నీవు నీ సంసారం ఈ ఇంట్లో వుండండి. ఇల్లు జాగ్రత్తగా చూసుకోండి చాలు. నేనా ఇప్పట్లో బొంబాయి నుంచి రాను. ఉద్యోగ విరమణ చేశాక ఇక్కడికే వచ్చేది. అప్పుడు నా ఇల్లు నాకు జాగ్రత్తగా అప్పచెప్పు. ఎవరూ లేకపోతే తాళం పెట్టినా పగుల కొట్టి ఇంట్లో దూలాలు వాసాలు కిటికీలు తలుపులు పీక్కుపోతారు. పెంకులు సహితం ఏరుకుపోతారు''

''స్థలం కూడా ఆక్రమించుకుంటున్నారు బాబయ్యా'' అన్నాడు సుబ్బన్న.

వులిక్కిపడ్డాను. నంగి వెధవలా కనిపించే వీడికి ఇలాంటివి కూడా తెలుసా అని ఆశ్చర్యపడ్డాను.

''అవును. అందుకే ఇల్లు నీకు అప్పగిస్తున్నాను. నువ్వు నాకు కాణి ఇవ్వక్కర్లేదు. ఇంటిని చక్కగా చూసుకో చాలు. నే రాగానే నా ఇల్లు నాకు అప్పగించు'' అన్నాను.

''మా నాయన మా తాత ముత్తాత తమరి ఉప్పు తిన్నారు. నేను తమరికి అన్యాయం చేస్తానా బాబయ్యా. తవరి ఇంటిని బంగారంలా సూచుకుంటాం. తవరి ఇంటి చుట్టూతా వున్న ఖాళీ స్థలంలో బంగారం పండిస్తా'' అన్నాడు.

''బంగారం అక్కర్లేదు. ఎవరూ కబ్జా చెయ్యకుండా చూసుకుంటే చాలు'' అన్నాను.

''నా కంటంలో పానం వుండగా సెంటు భూమి పోనిస్తానా బాబయ్యా. మట్టిలో పుట్టి మట్టిలో పెరిగిన ఓన్ని మట్టిని పానంగా చూసే వాడ్ని. మీ పెరడు నందన వనం చేస్తాను'' అన్నాడు సుబ్బన్న.

అక్షరాలా అలాగే చేశాడు.

ఇంటి దూలాల నిండా గబ్బిలాలు వేలాడేవి. పెంకులన్నీ చెదిరిపోయి ఇల్లంతా వాన కురిసేది.

సుబ్బన్న ఇల్లెక్కి పెంకు నేశాడు. పెంకులు అసలు లేని చోట తాటాకు కట్టాడు. ఇంక ఇంటి చుట్టూ ఖాళీ స్థలాన్ని నిజంగానే నందనవనం చేశాడు. ఇంటి చుట్టూ అరకదున్ని ఏటిమట్టి తెచ్చి పోశాడు. పశువుల వెంట, గొర్రెల వెంట పిల్లల్ని పంపించి, తట్టలతో ఎరువు సేకరించి పెరటిమట్టిలో కలిపి నేల పదును చేశాడు.

ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళ ఆఫీసుల చుట్టూ తిరిగి రకరకాల పళ్ళ మొక్కలు తెచ్చి నాటాడు.

ఒక పక్కంతా కూరగాయ మొక్కలు, తీగ టమోటా పందిరికి ఎక్కించాడు. సొరకాయ తీగ ఇంటి మీదికి పాకించాడు. గుంజలు పాతి దొండ తీగలు ఎక్కించాడు. లేత వంకాయతో వున్న వంగ నారు చూస్తే నాకు జిహ్వలేచి వచ్చేది. కరివేపాకు చెట్లు, కూరల్లో తాజా కరివేపాకు దూసి వెయ్యాలన్నది మా ఆవిడ కోరిక. అందుకే బొంబాయిలో బాల్కనీలో కాండి పెట్టి కరివేపచెట్టు నాటి కరివేప మొక్కని పెంచింది. మా ఆవిడ మా పెరటి కరివేప మొక్క చూస్తే గంగవెర్రులెత్తటం ఖాయం. నేను మా పెరటి తోటని గురించి చెప్తే తెగ సంబరపడిపోయింది.

''హాయిగా ఈ చివరి రోజుల్లో మన ఇంట్లో వుందాం అండి'' అంది. ''ఒక బర్రె కూడా కొనుక్కుందాం. పాడికి లోటు వుండకుండా'' అని కూడా అంది.

సుబ్బన్నకి ఇల్లు అప్పగించి సరిగ్గా ఏడాదికి పంట కోతల సమయంలో గ్రామం వచ్చి మా ఇంటిని చూసిన నాకు కలిగిన ఆనందం ఏమని వర్ణించనూ? ముళ్ళడొంకలతో పాము పుట్టల్లాంటి చెదలు పట్టి ఎండిన పిచ్చి చెట్లతో, అటు ఇటు స్వైర విహారం చేసే ఎలుకలు, పందికొక్కులతో వుండే పెరడుని ఎంత ఉద్యానవనంలా చేశాడు? చెత్తా చెదారం దుమ్ము చేరి మూసుకుపోయిన ఊట బావిలోంచి ఊబు తీసి, చెత్తనీళ్ళన్నీ తడి మొక్కలకి పోసి తేటగా స్వచ్ఛమైన నీళ్ళు తళతళలాడేలా బావి శుభ్రం చేశాడు. కాణీ ఖర్చుపెట్టకుండా అంతా రెక్కల కష్టంతోనే చేశాడు. ఏటా పొలం పనిమీద వచ్చినప్పుడల్లా నా ఇంటి పెరటి తోటని ఒక ప్రేక్షకుడిలా చూస్తున్నాను. అక్కడే వుండిపోవాలనిపించినా ఉద్యోగ బాధ్యతల వల్ల తిరిగి బొంబాయి వెళ్ళిపొయ్యేవాడిని. ఏటికాఏడు తోట ఏపుగా తయారై మహావృక్షాలతో పూత పిందెతో కళకళలాడి పోతుంది నా పెరడు. ఇదంతా సుబ్బన రెక్కల కష్టం. పేదవాడు అనుభవించని. నేను వచ్చాక ఇదంతా నాదే అవుతుంది కదా అని తృప్తిపడేవాడ్ని.

అలాంటిది ఇప్పుడు బొంబాయి నుంచి శాశ్వతంగా గ్రామం వచ్చేస్తున్నాను. ఇంక హాయిగా పల్లెపట్టు ప్రశాంత వాతావరణంలో నా ఇంట్లో వుండచ్చు. నా ఆనందం ఏమని వర్ణించను?

రిటైర్ అవగానే ఫ్లాట్ అమ్మకానికి పెట్టి గ్రామం వచ్చాను.

''సుబ్బన్న నేను ఉద్యోగంలో రిటైర్ అయ్యాను. గ్రామం వచ్చేస్తున్నాను. ఇంక మా ఇంట్లోనే నేను మా ఆవిడ వుందాం అనుకుంటున్నాం. బొంబాయిలో ఇల్లు అమ్మేస్తున్నాను''

''అలాగా బాబయ్యా. చాలా సంతోషం సామి'' అన్నాడు సుబ్బన్న ముఖంలో నేనూహించినట్లు ఏ విధమైన అలజడి కనిపించలేదు.

''ఇకనుంచి నా పొలం కూడా నేను చూసుకుంటూ, నా ఇంట్లోనే వుందాం అనుకుంటున్నాం. అందుకని నువ్వు మా ఇల్లు ఖాళీ చెయ్యాలి సుబ్బన్నా'' అన్నాను.



''తప్పకుండా బాబయ్యా. ఇది తమరి ఇల్లు..ఇల్లు ఎప్పటికి కావాలి బాబయ్యా'' అన్నాను.

''ఒక్క నెలరోజుల్లో చెయ్యాలి సుబ్బన్నా. వచ్చే నెల్లో వద్దాం అనుకుంటున్నాం'' అన్నాను.

''అలాగే బాబయ్యా. ఓ పది రోజుల్లో ఇల్లు ఖాళీ చేస్తాను'' అన్నాడు.

నాకు చాలా సంతోషం వేసింది. సుబ్బన్న మీద గౌరవం పెరిగింది.

''కానీ సుబ్బన్నా, నేను వచ్చేవరకు కాస్త నువ్వు ఇంటికి కాపలాగా వుండాలి. లేకపోతే ఈ మొక్కలు అన్నీ నీరసం అయిపోతాయి. ఇన్నాళ్ళ నీ శ్రమా వృథా అయిపోతుంది'' అన్నాను.

''తప్పకుండా బాబయ్యా. ఆ మాట తమరు చెప్పాలా. మొక్కలంటే నాకు పానం. ఆటిని గాలికి ఒదిలేస్తానా? మీరూ అమ్మగారు వచ్చాకే నేను ఎడతాను'' అన్నాడు.

''సంతోషం సుబ్బన్నా. ఈలోగా నాకు నువ్వు ఇంకో సాయం కూడా చెయ్యాలి'' అంటూ జేబు లోంచి వెయ్యి రూపాయలు తీసి సుబ్బన్న చేతిలో పెట్టాను.

''ఏంటి బాబయ్యా'' అన్నాడు.

''పెంకు చెదిరిపోయింది. బాగా సర్దించు. అవసరం అయితే ఇంకాసిని కొను. అలాగే ఇల్లంతా దులిపి, తెల్లసున్నం వేయించు. నేను బండలకి ఆర్డర్ ఇచ్చాను. మట్టి నేల మా ఆవిడ చేసుకోలేదు. అందుకని ఇల్లంతా బండలు పరిపించు'' అన్నాను.

''తప్పకుండా బాబయ్యా'' అన్నాడు, కూరగాయ మొక్కలు చుట్టూ పారతో పాదులు చేస్తూ. నేను ఎప్పుడు వెళ్ళినా సుబ్బన్న పెరట్లో మొక్కల మధ్య వుండేవాడు. నాతో మాట్లాడుతున్నప్పుడు కూడా పని ఆపడు.

''నిజంగానే సుబ్బన్న మా ఇంటిని నందన వనం చేశాడు'' అన్నాను ఒక్కసారి నా పొలం కౌలుకి చేస్తున్న పెద్ద రైతు కోటయ్యతో.

పెద్దరైతు కోటయ్య మూతి విరిచాడు. ''తమరి ఇల్లు నందనవనం కాదయ్యా ఆడి బతుకు నందన వనం చేసుకున్నాడు. మీ ఇంట్లోకి వచ్చాక ఆ సుబ్బన్న శానా బాగుపడ్డాడయ్యా. ఈ పాతికేళ్ళుగా ఆడు వుత్తిపున్నానికి రెక్కల కష్టం చెయ్యలేదయ్యా. ఆ కాయగూరలన్నీ గంపలకెత్తి పట్నం హోటళ్ళకి అమ్ముకున్నాడయ్యా. కొడుకుచేత సైకిళ్ళమీద పట్నం పంపించేవాడు. అరటికాయలు, అరటిపళ్ళ గెలలు గెలలమ్మి సొమ్ము చేసుకున్నాడు. ఇంక మామిడి కాయల కాలం వచ్చిందంటే ఆకులు కనిపించకుండా గుత్తులు విరగబూస్తాయి. అయన్నీ పట్నం హోటళ్ళకి అమ్మేస్తాడు. పాల సపోటాలు, జామపండ్లు, నిమ్మకాయలు..కరివేపాకు మోపులు..ఇరుగు పొరుగు అడిగినా కరివేపాకు రెబ్బ కూడా వూరికే పెట్టేవాడు కాదు. పావలో అర్దో తీసుకుని ఇచ్చేవాడు. అంతే కాదయ్యా..ఆ పూల చెట్లనిండా పూసిన మల్లెలు, కనకాంబరాలు, దవనం..చామంతులు కూడా బుట్టల్తో పట్నం పంపి అమ్మించేవాడు. కొడుకులు చేతికందాక అన్నీ పట్నం పంపించేసేవాడు. మీ ఇంటికి వచ్చి వాడు శానా బాగుపడ్డాడయ్యా. ఎకరం పొలం కొన్నాడు. పొలం పక్క బంగాళా పెంకుతో రెండు అరల ఇల్లు కట్టాడు. అంతా తవరి పెరటి తోట మీది సంపాదనే'' అన్నాడు అక్కసుగా పెద్దరైతు కోటయ్య.

'నిజమే. పండినవన్నీ తినలేడు. అమ్ముకున్నాడు. కానీ నాతో ఒక్కమాట చెప్పనే లేదు. డబ్బు వాటా అడుగుతానని కాబోలు' అనుకున్నాను. మళ్ళీ అంతలోనే సర్దుకున్నాను. 'పోనీలే పేదవాడు. ఇంటిని పచ్చగా చూశాడు. ఇంట్లో ఎవరూ లేకపోతే ఈపాటికి ఇల్లు పాడు బడటమే కాదు ఆ ఇంటి దూలాలు వాసాలు తలుపులు చెక్కలు అన్నీ ఊళ్ళో వాళ్ళు పీక్కొనిపోయి వుండేవారు. కాపలాగా సుబ్బన్న వుండబట్టి ఇల్లు స్థలం దక్కింది' అని కూడా అనిపించింది.

'సుబ్బన్న పేదవాడు. రెక్కల కష్టం చేశాడు. నాలుగు రూపాయలు వెనకేసుకుంటే వేసుకున్నాడేమో. కానీ ఏ శ్రమా లేకుండా రేపట్నుంచి అవన్నీ నాకే కదా? ఆ ఫలసాయం అంతా నేనే తింటాను. కలిసి వచ్చే కాలానికి నడిచివచ్చే కొడుకు అన్నట్లు..నేను ఎన్నేళ్ళు ఎంత శ్రమపడితే అంతంత చెట్లు పెంచగలను?' అని తృప్తిపడ్డాను.

అన్నింటిని మించి సుబ్బన్నలో నాకు నచ్చిన గుణం- 'మేం వచ్చేస్తున్నాం. ఇల్లు ఖాళీ చెయ్యాలి సుబ్బన్నా నువ్వు' అని నేను అనగానే- 'పాతికేళ్ళుగా శ్రమ చేశాను. ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోతాను' అని నిష్ఠూరంగా మాట్లాడకుండా, 'సర్లెండి బాబయ్యా వారం పది దినాల్లో తమరు వత్తానంటున్నారుకదా. అప్పటికి ఇల్లు ఖాళీ చేసేస్తాను బాబయ్యా' అన్నాడు.

నాకు జాలి అనిపించింది. ''సుబ్బన్న ఊరి చివరి నా పొలాలు ఉన్నాయి కదా. కావాలంటే మా పశువుల పాక వుండే జాగాలో నువ్వు గుడిసె వేసుకొని వుండు'' అన్నాను.

''అక్కర్లేదు బాబయ్యా. నా పొలం గట్టున గుడిసె వేసుకున్నాను'' అన్నాడు.

★ ★ ★

బొంబాయి నుంచి పూర్తిగా మకాం ఎత్తేసి గ్రామం వచ్చేశాం నేనూ మా ఆవిడ.

సుబ్బన్న పెళ్ళాం పిల్లలు ఎప్పుడో వెళ్ళిపోయ్యారు.

మేం వచ్చాక సుబ్బన్న ఇల్లు పెరడు గేటు

## కింశర్మ రూటే వేరు

**'ఇతర తారల్లా అవకాశాల కోసం ఫోటోలు పట్టుకుని నిర్మాత, దర్శకుల చుట్టూ తిరగడం నాకు తెలియదు' అంటోంది కింశర్మ. ఇతర తారల్లాగా తనకు అందాన్ని పెంచుకునే అవకాశం లేదని ఎందుకంటే తనకు సహజసిద్ధంగా కొన్ని ప్రత్యేకత లున్నాయంటోంది. నిరాడంబరత, ఎక్స్‌పోజింగ్‌కి దూరంగా ఉండడం ఇక్కడ కుదరదని, సినిమా ఎంటర్‌టైన్‌మెంట్ కాబట్టి ప్రేక్షకుల కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉండాలని తన భావాల్ని కుండబద్ధలుకొట్టినట్టు చెబుతోంది. ఈ ముక్కుసూటి వైఖరే ఆమెని వార్తల్లోతారగా మార్చేస్తుందంటున్నారు.**



తాళాలు నాకు అప్పగించాడు.

''బాబయ్యగారూ..ఇంక నేను కూడా ఎళ్లొస్తా. ఇగో..తమరి పెరటి తోట. కంటి రెప్పలా కాపాడుకుంటూ వచ్చా. రోజూ రెండు పూటలా నీళ్ళు పెట్టడం మరిచిపోకండి. ఎరువులు మోతాదుగా వెయ్యాలి. ఆకు చీడపట్టకుండా చూడాలి'' పెరడంతా తిప్పి మొక్కల్ని వాటి వయసుతో సహా పరిచయం చేశాడు.

వసంత కాలం కావటంతో పెరటి మొక్కలన్నీ పూత పిందెతో ఉన్నాయి. ఏడాదంతా రెక్కల కష్టం చేశాడు. ఫలసాయం చేతికి అందేనాటికి నాకు అప్పగిస్తున్నాడు. జాలేసింది.

''బాబయ్యా'' పిలిచాడు సుబ్బన్న.

''ఆ..ఏమిటి సుబ్బన్నా''

చేతులు నలుపుకుంటూ ''ఏవన్నా కొంచెం ఇప్పించండి. తమరి దయా'' అన్నాడు నసుగుతూ.

''ఏమిటి సుబ్బన్నా?''

''అదే బాబయ్యా ఏవన్నా కొంత డబ్బు..''

ఆశ్చర్యపోయాను. ''డబ్బా..దేనికి?''

''ఇన్నాళ్ళు తమరి ఇల్లు పెరటి తోట పెంపకం చేశాను కదా అందుకు..కొంచెం ఏవన్నా..''

నేను ఆశ్చర్యపోయాను.

''ఊరికే చూడలేదు కదా సుబ్బన్న. ఇల్లంతా సుబ్బరంగా ఉన్నావా..ఫలసాయం అంతా నువ్వే అనుభవించావ్ కదా?''

''నిజమే బాబయ్యా. కాని ఇన్నేళ్ళు ఇయ్యన్నీ పెంచాను. తమరికి అప్పగిస్తున్నాను. అందుకని ఏదో ఇంత అని ఇస్తే..''

నా కళ్ళు ఎర్రబడ్డాయి. వాడి ధోరణే వాడిది కాని నా పాయింటు అర్థం చేసుకోవటం లేదు. అంతవరకు సుబ్బన్న మీద వున్న అభిప్రాయం తొలగిపోయింది. వాడి కక్కుర్తికి అసహ్యం వేసింది. దండిస్తున్నట్లు..ఆఫీసులో నా క్రింది ఉద్యోగుల మీద అధికారం చేస్తున్నప్పటి హోదాలో సుబ్బన్నని కఠిన స్వరంతో అన్నాను.

''సుబ్బన్నా..ఈ మొక్కలు నువ్వు నాటి పెంచినవే, కాదన్ను. కానీ అందుకు ప్రతిఫలంగా పాతికేళ్ళు నా ఇంట్లో ఊరికే ఉన్నావు. ఈ పళ్ళు కాయలు అన్నీ నువ్వే అమ్ముకుని తిన్నావ్. నువ్వు చేసిన కష్టానికి ఆ విధంగా నీకుప్రతిఫలం ముట్టింది. ఇంకా ఏమిటి? ఈ నేల నాది. ఈ మట్టి నాది. నా జాగాలో నువ్వు మొక్కలు పెంచావ్. నిజానికి నేను నిన్ను ఏదన్నా అడగాలి. కానీ అడగటం లేదు'' అన్నాను.

''నిజమే బాబయ్యా. ఆట్ని నాటి మొక్కల్ని చెట్లు చేసి పెంచింది నేనే. కానీ జాగా తమరిదే కాదన్ను. కానీ ఈ ఏడాది ఇంకా ఒక్క పండు కూడా నేను తినలేదు. ఈ ఫలసాయం అంతా తమరిదే..అందుకే బాబయ్యా..తమరు ఏదన్నా..కాస్త..''

నాకు వెర్రి కోపం వచ్చింది. కుక్కని సింహం అనుకున్నాను.

''సుబ్బన్నా.. మళ్ళీ మాట్లాడావంటే మర్యాద దక్కదు. నువ్వు మొక్కల్ని పెంచింది నా జాగాలో అని మర్చిపోతున్నావు. నేను నిన్ను నా జాగాకి కిరాయి అడిగానా? నా ఇంటికి అద్దె అడిగానా? లేదే. పండించావ్. తిన్నావ్. అంతే. కానీ ఎదురు నేను నీకు డబ్బు ఇవ్వటం ఏంటి? నీకంత అక్కసుగా వుంటే నీ మొక్కలు, చెట్లు నువ్వు పీక్కుపో'' అన్నాను కోపంగా.

ఏమనుకున్నాడో ఏమో సుబ్బన్న వెళ్ళిపొయ్యాడు.

అప్పుడు వస్తున్న మా పెద్ద రైతు అన్నాడు.

''ఆడి బుద్దే అంత దొరా. నే చెప్పాగా. మెలిక పేచీలు పెడతాడు. మంచిగ వున్నంతసేపు మడిసి. పగబడితే పాము'' అన్నాడు కొరకర సుబ్బన్నకేసి చూస్తూ.

ఈ సుబ్బన్న లేకి బుద్ధికి నాకు మనసంతా చికాకు అయిపోయింది.

ఆ సాయంత్రం మా మొక్కలకి నేనే నీళ్ళు పెట్టాను. నేనూ మా ఆవిడ సంబరంగా తోటలో తిరిగాము. మొక్కమొక్కనీ పలకరించాము.

''దొంగ వెధవకి..ఇన్నాళ్ళు తిన్నది, అమ్ముకొన్నది సరిపోలేదు. ఇంకా వెధవకి దురాశ'' అంది మా ఆవిడ.

★ ★ ★

తెల్లవారు ఝామున..

నాలుగు గంటలు దాటుతూంది.

## రీమా కోరిక

'తమిళ చిత్రాల్లో నటించడం చాలా హేపీగా ఉంది. మంచి పాత్ర లభిస్తే నా సత్తా నిరూపించుకోవడానికి ఇక్కడ అవకాశం ఉంది' అంటోంది రీమాసేన్. 'చెల్లియ్యై' పేరుతో తమిళంలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. జాతీయఅవార్డు గ్రహీత కెవి.ఆనంద్ ఈ సినిమాకి కొరియోగ్రఫీ అందిస్తున్నారు. 'ఈ చిత్రం నాకు మంచి అవకాశాలిస్తుందన్న ఆశాభావంతో ఉన్నాను' అని చెప్పే రీమా కోరిక నెరవేరాలని మనమూ ఆశిద్దాం.



పెరట్లో ఏదో సరసర శబ్దం వస్తూంది.

నేను లేపకుండానే మా ఆవిడ గభాల్న లేచింది.

చీకట్లు అప్పుడే విడుతున్నాయి. టార్చి తీసుకుని ఇద్దరం తలుపు తెరుచుకుని పెరట్లోకి వచ్చాం.

''ఎవరూ?''

''ఎవరది? ఏం చేస్తున్నా(రా'' అంటూ నే టార్చి వేస్తూ మొక్కల మధ్య పరుగెత్తినట్లు అటు ఇటు కలయ చూశాను.

ఎదురుగా సుబ్బన్న! చేతిలో గొడ్డలి. నేలమీద పడివున్న రంపం.

పక్కనే పిందెలతో గుత్తులు గుత్తులుగా వున్న రెండు సపోటా చెట్లు మొదలంటా నరకబడి నేల మీద పడి ఉన్నాయి.

''సుబ్బన్నా! ఏమిటి నువ్వు చేస్తున్న పని ఆగు'' అన్నాను ఆగ్రహంతో.

మళ్ళీ వేటు వెయ్యటానికి గొడ్డలి ఎత్తబోతున్న సుబ్బన్న ఆగి నా ముఖంలోకి చూశాడు.

''ఇయన్నీ నేను ఇత్తనం నాటి ఇరవై ఏళ్ళపాటు పెంచి పెద్ద చేసిన చెట్లు బాబయ్యా''

''అయితే?''

''ఈ ఏటి పంట మీద నాకు అక్కుంది. కొద్దిగా ఏవన్నా ఇయ్యమంటే తమరు ఇయ్యనంటిరి. కావాలంటే నా చెట్లని పీక్కు పొమ్మంటిరి''

''దుర్మార్గుడా..నువ్వు మనిషివా పశువ్వా. పూత పిందెతోవున్న ఆ చెట్లని నరకటానికి నీకు నీ మనసెలా ఒప్పిందిరా పాపిష్టి వెధవా. వాటిని పెంచిన ప్రేమన్నా నీకు లేకుండా పోయిందంటరా కసాయి వెధవా''

సుబ్బన్న కళ్ళు చికిలించి నా ముఖంలోకి తేరిబార చూశాడు. మాటలు సాగదీస్తూ అన్నాడు.

''ఆటిని ఇత్తనం నాటి నీరుపోసి ఎరువేసి ఇరవై సంవత్సరాలు పెంచినోడ్ని గనక ఆటిపై నాకు ప్రేమ బాబయ్యా. తవరు ముళ్ళడొంకలతో, పాము పుట్టలతో వున్న నేల బాగు సెయ్యలేదు. ఇత్తనం నాటలేదు. సెంబుడు నీళ్ళు పొయ్యలేదు. సేతులు అరిగి పొయ్యేలా చేతారా బట్టి బావిలోంచి నీళ్ళు తోడలేదు. పూత పిందె పట్టాక చెదపురుగులు, చెట్ల తెగుళ్ళు సోకితే చిటికెడు మందు జల్లలేదు. అసువంటిది నిన్నగాక మొన్న వచ్చిన తవరికి ఈ సెట్లమీద అంత ప్రేమ వుంటే, సంటిబిడ్డకి సేసినట్లు ఇరవై ఏళ్ళుగా ఈటి మధ్యన బతికి, వీటి పళ్ళు తిన్న నాకెంత భ్రముండాలి బాబయ్యా ఈటి మీద? పూతపిందెతో వున్న చెట్లు ఒదలాలంటే బాధెయ్యదా? కావాలంటే నా చెట్లు నన్ను తీసుకు పొమ్మన్నారుగా. అందుకని నరుక్కుపోతున్నా. ఆ కట్టె అమ్మినా నాకు డబ్బొస్తుంది గాదూ?'' అన్నాడు.

నా కోపం రెట్టింపు అయింది.

''కానీ ఆ నేల నాది. ఆ దొడ్డి నాది. నా నేలలో ఉన్నాయి చెట్లన్నీ'' అన్నాను రంకె వేస్తున్నట్లు.

''అందుకే వాటిని నేను మట్టిలోంచి పెకలించలేదు బాబయ్యా..చిన్న మట్టిపెళ్ళ కూడా రేగకుండా వేరు దెబ్బతినకుండా వాటిని మొదలంటా నరుకుతున్నాను బాబయ్యా. ఆ మానులు మళ్ళీ చిగురుపడతాయి. తమరే పెంచుకోవచ్చు'' అన్నాడు. నా నోరు మూసుకుపోయింది.


వాడి మాటల్లో ఏదో లాజిక్కుంది. అర్థం అయ్యీ అవనట్టుంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని, మార్కెటింగ్ పనిమీద విదేశాలు అన్నీ తిరిగి వచ్చాను. పెద్ద ఇంటర్నేషనల్ కంపెనీ లావాదేవీలు చేశాను. షేర్ల వ్యవహారాలు సమర్ధవంతంగా నడిపించి కంపెనీకి లాభాలు తెచ్చి పెట్టాను. ఎన్నో సమస్యల్ని చాకచక్యంగా పరిష్కరించాను. ఏటా కంపెనీ బెస్ట్ వర్కర్ అవార్డు నాదే.

అంతటి నేను సుబ్బన్న ముందు గొంతు పెగల్చలేకపోతున్నానునిన్నటిదాకా సుబ్బన్నది వితండ వాదం అనుకున్నాను. కొద్దిక్షణాల క్రితం దాకా కూడా గొర్రెని మేపి మెడనరికే కసాయిలాగే సుబ్బన్న నాకు కనిపించాడు.

కానీ సుబ్బన్న మాటల్లో శ్రమశక్తి కనిపిస్తుంది. చెమట చుక్క విలువ తెలుస్తుంది.

''వాడు నా కొడుకు. నవమాసాలు మోసి కని కష్టపడి వాడ్ని పాతికేళ్ళు పెంచాను. వేలకి వేలు ఖర్చు పెట్టి వాడికి చదువు చెప్పించాను. వాడు పెద్ద ఉద్యోగస్తుడై సంపాదించే వేళ్టికి నీ మొగుడు అయినంత మాత్రాన వాడి మీద తల్లిగా నాకు అధికారం లేకుండా పోతుందా? వాడి మీద వాడి సంపాదన మీద నాకు ఏ హక్కు లేకుండా పోతుందా?'' అంటూ బొటబొట కారుతున్న కన్నీటిని పయిట చెంగుతో తుడుచుకుంటూ నా భార్య నా కోడలుతో తగాదా పడటం జ్ఞాపకం వచ్చింది.

సుబ్బన్న మాటలకి, నా భార్య మాటలకి ఏదో సంబంధం వుందనిపిస్తోంది.




సుబ్బన్నలో నా భార్య ఆవేదన కనిపిస్తుంది.

అంతవరకూ అగ్నిలా మండిన నా మనసు పూలమాదిరి మెత్తబడింది.

గభాల్న సుబ్బన్న దగ్గరికి వెళ్ళి వాడి చేతిలోని గొడ్డలి అందుకుని కిందపడేశాను.

''సుబ్బన్న ఆగు. చెట్లు నరక్కు. ఈ ఏటి ఫలసాయం నీదే. దయచేసి పూతపిందెతో వున్న ఆ చెట్లని నరక్కు.. పాపం''

''అందుకే కద బాబయ్యా..ఏదన్న ఇంత ఇయ్యమని అడిగాను. కానీ తమరే..చెట్లు నరుక్కుపొమ్మ...'' ''బుద్ధి గడ్డితింది నాయనా. ఆగు'' అంటూ పరుగెత్తినట్లు లోపలికి వెళ్ళి బీరువాలోంచి మూడు వేలు తెచ్చి వాడి చేతిలో పెట్టాను.

సుబ్బన్న కళ్ళు మెరిశాయి.

''సంతోషం బాబయ్యా'' అంటూ డబ్బు తీసుకుని దణ్ణం పెట్టాడు. ఇంక ఈ సెట్లకి నాకు సంబంధం లేదు. ఇప్పుడిలా ఋణం తీరిపోయింది. ఇంక ఇయ్యన్నీ తమరివే'' అంటూ గొడ్డలి రంపం తీసుకుని వెళ్ళిపొయ్యాడు. నా ప్రాణం ఊరట పడింది.

కానీ నేల వాలిన రెండు సపోటా చెట్లు, గొడ్డలి దెబ్బతిన్న మామిడిచెట్టు నాకేసి జాలిగా చూస్తున్నాయి.

ఓ మూడువేలు వాడికి ఇవ్వటానికి ప్రాణం ఒప్పక నీ చెట్లు నువ్వు నరుక్కుపో అన్నాను. కానీ వాడు నిజంగానే ఈ చెట్లని నరికాడు. మళ్ళీ వాటిని ఇంత ఎత్తుగా పెంచటానికి నేను ఎన్ని వేలు ఖర్చు పెట్టవలసి వచ్చేదో..ఎంత శ్రమ చెయ్యవలసి వచ్చేదో. ఉద్యానవన శాఖ వారిని సంప్రదించి ఈ మామిడి చెట్టుని కాపాడాలి అనుకుంటూ ఆపేక్షగా ఆ చెట్టుని సవరించాను.

అప్పటికే తూరుపు తెల్లబారింది. ఏ మూలో మామిడికొమ్మల్లోంచి కోయిల కూ కూ కుహూ..అంటూ రాగం మొదలెట్టింది పరవశంగా.''బొంబాయి ఫ్లాటు అమ్మితే ఎనభై లక్షలు వచ్చింది. కానీ ఏ జన్మాన కోయిల పాట వినిపించలేదు. మూడు వేలు పోతే పొయ్యాయి లెండి. కానీ కోయిల పాట ఇకనుంచి రోజా వినచ్చు. రోజా కోయిల మేలుకొలుపులే మనకి'' అంది మా ఆవిడ మహలక్ష్మి.

''అవును''

'అవును' అన్నట్లు మరో రెండు కోయిల్లు మొదటి కోయిలతో కుహూ..కుహూ.. అంటూ గొంతు కలిపాయి. ప్రసిద్ధ సంగీత విద్వాంసులు అందరూ కలిసి కచ్చేరి చేస్తున్నట్లు మా తోట మారు మ్రోగ సాగింది.